

సీబీఎస్ఈ.. శూన్యం

- సర్కారు బడుల్లో చతికలబడ్డ బోధన
- అంతర్గత పరీక్షల్లో 65 శాతం విద్యార్థులు ఫెయిల్
- ఈ ఏడాది పది పరీక్షలు లేనట్లే..
- స్టేట్ సిలబస్‌తోనే పరీక్షలకు సన్నద్ధం చేసే ప్రణాళిక
- ఉమ్మడి జిల్లాలో 35కు పైగా సీబీఎస్ఈ పాఠశాలలు

గుంటూరు(విద్య),ఆగస్టు 28: సర్కారు బడుల్లో ఆర్భాటంగా ప్రవేశ పెట్టిన సీబీఎస్ఈ బోధన.. 'ఆదిలోనే హంసపాదు' అన్న చందంగా తయారైంది. సరైన ప్రణాళిక, బోధన, ప్రమాణాలు పాటించకపోవడం, ఉపాధ్యాయులకు కొరవడిన శిక్షణ వంటి అంశాలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. ఫలితంగా సీబీఎస్ఇలో చదివినా ఈ ఏడాది పరీక్షలకు హాజరుకాలేని దుస్థితి. గత వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో దాదాపు 35 కు పైగా పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన ప్రవేశ పెట్టింది. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం పదవ తరగతిలో ఉన్న విద్యార్థినీవిద్యార్థుల సంఖ్య 5 వేల వరకు ఉన్నారని సమాచారం. ఈ విద్యార్థులు వచ్చే మార్చి, ఏప్రిల్‌లలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరిగే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అయితే, విద్యార్థులను ఆ దిశగా పరీక్షలకు సన్నద్ధం చేసిన దాఖలాలు దాదాపు శూన్యం. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల్లో వారి నైపుణ్యాలు పరిశీలించడానికి ఇటీవల పాఠశాల విద్యాశాఖ అంతర్గతంగా పరీక్షలు నిర్వహించింది. ఆంగ్లం, సైన్స్, సోషల్ స్టడీస్, గణితం విభాగాల్లో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ చూసి అధికారులు నివ్వెరపోయారు. ఎందుకంటే, కనీసం 65 శాతం మంది విద్యార్థులు నైపుణ్య పరీక్షలో ఫెయిల్ అయ్యారు. వీరు సిబిఎస్ఇ విధానంలో జరిగే పరీక్షలకు హాజరైతే భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాటి తప్పుడు నిర్ణయాలు.. విద్యార్థులు తిరోగమనం వైపు

గత వైసీపీ ప్రభుత్వం విద్యా రంగానికి సంబంధించి నాడు చేసిన సంస్కరణలు, తీసుకున్న అనేక తప్పుడు నిర్ణయాలకు విద్యార్థులు ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. ప్లస్ టు విధానం ప్రవేశ పెట్టి అక్కడ కనీస వసతులు, బోధనకు అధ్యాపకులను నియమించలేదు. ఫలితంగా అక్కడ చదివిన విద్యార్థులు 90 శాతం ఫెయిల్ అయ్యారు. ఇలా పేద విద్యార్థులను ఇంటర్ విద్యకు దూరం చేశారు. ఐబి సిలబస్,టోఫెల్ బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, బైజూస్ ఒప్పందాలు ఇలా ఎన్ని ఆర్భాటాలు చేసినప్పటికీ అవి విద్యార్థులకు ఉపయోగపడక పోగా, వారిని తిరోగమన దిశలో పయనించేలా చేశాయి. సీబీఎస్ఈ విధానం కూడా అదే మాదిరి తయారవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.


ఈ విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో జరిగే ఎస్ఎస్‌సి పరీక్షలకు సన్నద్ధం చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

ఉపాధ్యాయులను సన్నద్ధం చేశారా?

ఉమ్మడి జిల్లాలో సీబీఎస్ఈ విధానంలో పాఠశాలలు ప్రారంభించడానికి ముందస్తు సన్నాహాలు ప్రభుత్వం చేయలేదు. ప్రధానంగా, ఉపా ధ్యాయులకు కనీస శిక్షణ ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సీబీఎస్ఈ విధానంపై అమలుకు అవసరమైన మౌలిక వసతులు పాఠశాలల్లో కల్పించలేదు. సిబిఎస్ఇ బోర్డు సూచించిన విధానంలో ఎటువంటి ముందస్తు ప్రణాళికా లేకుండానే తరగతులు ప్రారంభించారు. దీంతో, విద్యార్థులను అందుకు అను గుణంగా సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదు. సీబీఎస్ఈలో బోధన అంతా విద్యార్థిలో నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా సాగుతుంది. విద్యార్థులను ఎటువంటి ఒత్తిళ్ళకు గురిచేయకుండా బోధన సాగుతుంది. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పాఠ్యపుస్తకాల నుంచే సొంతంగా నోట్స్ తయారు చేసుకుని పరీక్షలకు హాజరయ్యేలా సన్నద్ధం చేస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులకు 20 మార్కులు ఇంటర్నల్‌లో కేటాయిస్తారు. సిబిఎస్ఇలో టీచింగ్‌లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు వినియోగిస్తారు. ఉపాధ్యాయు లకు ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన బోధనపై ఏటా ప్రత్యేక శిక్షణా తరగతులు ఉంటాయి. ఇందుకు ఎన్‌సిఇఆర్‌టిలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన అధ్యాపకులు, ప్రొఫెసరుల సహాయం తీసుకుంటారు. ఇలా అనేక విషయాలు బోధన విషయంలో అమలు చేస్తారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా హడావుడిగా సీబీఎస్ఈ ప్రవేశ పెట్టడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిది.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ అరుణ్‌బాబు


సమీక్ష మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావు పేట, ఆగస్టు 28: జిల్లాలో ఈ నెల 30న జరగనున్న వనమహోత్సవం కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సమష్టి కృషితో విజయవంతం చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. వనమహోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరుకానున్న నేపథ్యంలో ఆయా ఏర్పాట్లపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వనమహోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తొలిసారిగా జిల్లాలో పర్యటించనున్నారన్నారు. నరసరావుపేట మండలం కాకాని జేఎన్టీయూ క్యాంపస్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర సంస్థల్లో ఏకకాలంలో నిర్వహించే వనమహోత్సవానికి సంబంధిత అధికారులు మొక్కలు సరఫరా చేయాలన్నారు. వేడుకలకు హాజరయ్యే అధికారులు, ప్రజలు, విద్యార్థుల కోసం తాగునీటి వసతి, తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో వినాయకం తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ విలవిల

తిరుగేలేదు.. 30 ఏళ్లు మాదే అధికారం.. ఇక ప్రతిపక్షం ఆనవాళ్లే ఉండవు.. అని విర్రవీగిన వైసీపీ ప్రస్తుతం విలవిలలాడుతోంది. ఇప్పటికే గత సార్వత్రిక ఎన్నికల్లో కోలుకోలేని దెబ్బతో అల్లాడిపోతోంది. ఈ పరిస్థితుల్లో పలువురు సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేల వరుస రాజీనామాలతో నేతల్లో గందరగోళం నెలకొనగా.. క్యాడర్ కలవరపడుతోంది. మొత్తంమీద 2019 ఎన్నికల్లో ఘన విజయంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ వెలుగువెలిగిన ఫ్యాన్ పార్టీ ప్రస్తుతం గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీ నేతలు పలువురు అధినేత జగన్‌కు షాక్ ఇచ్చారు. ఎన్నికల అనంతరం కూడా అదే పరంపర కొనసాగుతూ వస్తోంది. పార్టీ పరాజయం అనంతరం మాజీ ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, కిలారి రోశయ్య రాజీనామా చేయగా తాజాగా ఎమ్మెల్సీ పోతుల సునీత అదే బాట పట్టారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడైన మోపిదేవి వెంకటరమణ టీడీపీలో చేరాలనే నిర్ణయం వైసీపీ నేతలను మరింత కలవరపరుస్తోంది.

ఎన్నికలకు ముందే చీ కొట్టి వచ్చేశారు..

తాడికొండ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో ప్రతిష్ఠాత్మక విజ యం సాధించిన ఉండవల్లి శ్రీదేవి 2024 ఎన్నికలకు ముందే జగన్‌ను ఛీ కొట్టి టీడీపీలో చేరరారు. తిరిగి తనకు జగన్ సీటు ఇచ్చే ఉద్దేశంలో జగన్ లేరని ముందుగానే గ్రహించిన ఆమె వైసీపీని వీడారు. ఇక ఎమ్మెల్సీ హోదాలోనే వైసీపీలో కొనసాగిన జంగా కృష్ణమూర్తి యాదవ్ ఆ పార్టీలో తనను సర్పంచ్ కంటే హీనంగా వైసీపీలో రెడ్డి సామాజికవర్గం నేతలు చూస్తున్నారనే బాధతో ఎమ్మెల్సీ పదవిని సైతం వదులుకుని టీడీపీలో చేరారు. ఇక 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ఓ వెలుగు వెలిగిన మాజీ మంత్రి మాణిక్యవర ప్రసాద్ సైతం ఎన్నికలకు ముందే జగన్‌ను వీడి టీడీపీలో చేరారు. ఎన్ని కల సమయంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న కత్తెర హెనీ క్రిస్టీనా దంపతులు సైతం టీడీపీలో చేరారు. దీంతో ఆ పార్టీ పరిస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లాలో అగమ్య గోచరంగా మారింది.

గుంటూరు, బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ వెలుగు వెలిగిన వైసీపీ నేడు దీనావస్థలో కునారిల్లుతున్నది. గత ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే స్థానాన్ని కూడా దక్కించుకోకుండా ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఊహించని పరిణామాలతో వైసీపీ అధినేత జగన్ మరింత కుంగిపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జగన్‌కు వైసీపీ నేతలు వరుసగా షాక్ ఇస్తున్నారు. ఎన్నికలకు ముందే పలువురు వైసీపీ కీలక నేతలు జగన్ తీరు నచ్చక గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం తర్వాత కూడా రాజీనామాల పరంపర కొనసాగుతూ వస్తోంది. బాపట్ల జిల్లాలో ఎన్నికలకు ముందు వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం చాలా వరకు టీడీపీ బాట పట్టింది. ఈ క్రమంలో వైసీపీ కీలక నేత, రాజ్యసభ ఎంపీ, జిల్లా వైసీపీ అధ్యక్షులుగా ఉన్నటువంటి ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఎంపీకి రాజీనామా చేయడంతో పాటు పార్టీని కూడా వీడడానికి గురువారం ముహూర్తం ఖరారైన నేపథ్యంలో వైసీపీ పరిస్థితి మరింత గందరగోళంలో పడింది. మోపిదేవి అడుగులు టీడీపీ వైపేనన్న స్పష్టత దాదాపుగా వచ్చింది. ఇక బాపట్ల జిల్లాలోని చీరాల నియోజకవర్గానికి చెందిన పోతుల సునీత తన ఎమ్మెల్సీ పదవితో పాటు వైసీపీకి కూడా రాజీనామా చేస్తున్నట్లు బుధవారమే ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో బాపట్ల జిల్లా వైసీపీలో ఏం జరుగుతుందనే అయోమయం పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఈ రాజీనామాల పరంపర ఇంతటితో ఆగబోదని మరింత మంది నేతలు టీడీపీలోకి క్యూ కట్టనున్నారనే సమాచారం వైసీపీని తత్తరపాటుకు గురిచేస్తోంది. ఎంపీ మోపిదేవి జిల్లా వైసీపీ అధ్యక్షులుగా ఉండగా, పోతుల సునీత నిన్నమొన్నటి వరకు వైసీపీరాష్ట్ర మహిళా విభాగం వంటి కీలక స్థానంలో అధ్యక్షురాలిగా పని చేశారు. వీరిద్దరూ ఒకే రోజు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించడంతో వైసీపీ అధిష్ఠానం కంగుతిన్నది. మోపిదేవి తదుపరి అడుగులు టీడీపీ వైపేనన్న స్పష్టత రాగా, పోతుల సునీత విషయంలో ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. చీరాలలోని ఆమె అనుచరగణం మాత్రం బీజేపీలో చేరనున్నారనే ప్రచారం చేస్తున్నారు. ఎంపీ మోపిదేవి విషయంలో మంత్రి అనగానితో పాటు అన్ని వైపుల నుంచి సానుకూలతలు వ్యక్తం కావడం వల్లే టీడీపీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. చేరికల విషయంలో తొందరపడకుండా ఆచితూచి నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో టీడీపీ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది.

2019 ఎన్నికల్లో పొన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కిలారి వెంకట రోశయ్య కూడా ఇప్పటికే ఆ పార్టీని వీడారు. గత ఎన్నికల్లో ఆయన గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే తిరిగి పొన్నూరు నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేయాలని రోశయ్య భావించినా ఆయనకు అక్కడ గెలిచే అవకాశాలు లేవని భావించిన జగన్ గుంటూరు లోక్‌సభ స్థానానికి వలస తెచ్చారు. బలవంతంగా బరిలోకి దిగినా రోశయ్య పూర్తిగా కాడి కింద పడేయడంతో టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మూడున్నర లక్షలకుపైగా మెజార్టీతో ఘన విజయం సాధించారు. తనను ఎమ్మెల్యేగా పోటీ చేయనివ్వలేదనే కోపంతో ఉన్న రోశయ్య ఇటీవల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో గెలుపొందిన మద్దాళి గిరి కూడా ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున గెలుపొంది వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ చేశారు. చిలకలూరిపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ నాటి మంత్రి రజినీని గుంటూరు పశ్చిమకు వలస తీసుకొచ్చి 2024 ఎన్నికల్లో గిరికి సీటు లేకుండా చేశారు. దీంతో ఆయనతో పాటు వైశ్య సామాజికవర్గం కూడా కొంత కినుక వహించింది. ఆ మనస్థాపంతో ఉన్న గిరి కూడా ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడ్డుకాలం

- సార్వత్రిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్
- వరుస రాజీనామాలతో శ్రేణుల్లో కలవరం
- ఫ్యాన్ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సీనియర్లు సిద్ధం
- ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేలు గిరి, రోశయ్య రాజీనామా
- ఎన్నికలకు ముందే పార్టీని వీడిని ఎమ్మెల్యే శ్రీదేవి, ఎమ్మెల్సీలు జంగా, డొక్కా
- టీడీపీలో చేరిన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ క్రిస్టీనా
- తాజాగా ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామాతో పార్టీ నేతల్లో కలవరం
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి టీడీపీలోకి వెళ్లాలనే నిర్ణయంతో ఉలికిపాటు

టీడీపీ ఖాతాలోకి రేపల్లె మున్సిపాలిటీ?


తీరప్రాంతంలో ఎంపీ మోపిదేవికి తన వెంట నడిచే అనుచరగణం ఉంది. ముఖ్యంగా మత్స్యకార సామాజిక వర్గం ఎప్పటి నుంచో ఆయన వెంట ఉంది. ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరనుండడంతో రేపల్లె నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు టీడీపీకి మరింత అనుకూలంగా మారనున్నాయి. ఎంపీ మోపిదేవి రాజీనామాతో రేపల్లెలో వైసీపీ దాదాపు ఖాళీ అయినట్లేననే అభిప్రాయానికి ఆ పార్టీ శ్రేణులే వచ్చాయి. రేపల్లె మున్సిపాలిటీలో మొత్తం 28 కౌన్సిలర్లకు వైసీపీ బలం 26గా ఉంది. ఎంపీ మోపిదేవితో పాటు పెద్దఎత్తున వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని సమాచారం. దీంతో మారనున్న రాజకీయ సమీకరణాల ప్రకారం రేపల్లె మున్సిపాలిటీ టీడీపీ ఖాతాలో పడే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇమడలేకపోతున్న కుడి భుజం

వైసీపీ ఆవిర్భావం నుంచి అధినేత జగన్‌కు కుడి భుజంగా మోపిదేవి వెంకటరమణ ఉన్నారు. ఆ పార్టీకి గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం బాపట్ల జిల్లాలో పెద్ద దిక్కుగా వ్యవహరించారు. అయితే జగన్ తీరుతో పార్టీలో ఇమడలేకపోతున్న రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ కూడా పార్టీని వీడేందుకు సిద్ధమవటం ఆ పార్టీకి పెద్ద షాక్‌గా చెప్పవచ్చు. జగన్ సీఎం పదవిని చేపట్టక ముందు జైల్లో ఉన్న సమయంలో ఆయనతో పాటు మోపిదేవి తోటి ఖైదీగా ఉండి ఆయనకు మరింత సన్నిహితమయ్యారు. అందువల్లే ఆయన 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పరాజయం పాలైనా మంత్రి పదవిని కట్టబెట్టి ఆ తర్వాత ఎమ్మెల్సీని చేశారు. తదనంతర పరిణామాల్లో ఢిల్లీలో తనకు ఓ నమ్మకస్తుడు ఉండాలనే భావనతో ఆయన్ను రాజ్యసభకు ఎంపిక చేసి పంపించారు. అయితే 2024 ఎన్నికల్లో తిరిగి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆకాంక్షను వ్యక్తం చేసినా ఆనాడు సీఎంగా ఉన్న జగన్ అందుకు నిరాకరించారు. కనీసం తన సోదరుడికైనా టికెట్ ఇవ్వాలని పట్టుపట్టినా జగన్ అంగీకరించలేదు. ఎన్నికలకు ముందు రేపల్లెలో గణేష్ అభ్యర్థిత్వంలో పునరాలోచించాలని పలుమార్లు జగన్‌ను అభ్యర్థించారు. ఇదే విషయం మాట్లాడానికైతే మరోమారు తన వద్దకు రావద్దని అప్పటి సీఎం జగన్ ఎంపీ మోపిదేవికి చెప్పినట్లు, అదే విషయాన్ని తన అనుచరుల వద్ద చెప్పి ఎంపీ ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. ఇదంతా ఒక ఎత్తయితే జిల్లా వైసీపీ అధ్యక్ష పగ్గాలు అప్పచెప్పి సీట్ల ఖరారు విషయంలో నామమాత్రంగా కూడా తన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని అవమానంగా మోపిదేవి భావించారు. దీనికి తోడు ఇష్టంలేని వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో అప్పటి నుంచి మోపిదేవి మనస్థాపానికి గురయ్యారు. ఎన్నికల ఫలితాల విడుదలయిన దగ్గర నుంచి ఎంపీ మోపిదేవి వైసీపీ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటూనే వస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. తద్వారా రాజ్యసభ సభ్యుడి పదవిని కూడా వదులుకునేందుకు ఆయన సిద్ధం కావడం విశేషం.

అప్‌గ్రేడ్ చేసినా.. అవే సమస్యలు

- ఎవరికీ పట్టని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల
- వైద్యులు, స్టాఫ్ నర్సులు లేక రోగుల అవస్థలు
- వంద పడకలైనా పెరగని పారిశుధ్య కార్మికులు, గార్డులు



సత్తెనపల్లి, ఆగస్టు 28: సత్తెనపల్లి ఏరియా వైద్యశాలను 50 పడకల నుంచి వంద పడకల ఆస్పత్రిగా మార్చారు. అయితే ఆస్పత్రిలో సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయి. వైద్యులు, నర్సింగ్ పోస్టుల నియామకాల గురించి పట్టించుకోలేదు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల వారికి ఈ ఏరియా ఆస్పత్రే ఆధారం. పెద్దసంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నా వారికి సరైన వైద్య చికిత్సలు అందడంలేదు. దీంతో ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయినా సమస్యలు తీరవా, తీర్చరా అని ప్రజలు మండిపడుతున్నారు. ఆస్పత్రిలో ప్రధానంగా రేడియాలజిస్ట్, జనరల్ మెడిసిన్, డీఎన్ఎస్ జనరల్ పోస్టు, ఎంబీఎస్ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల రోగులకు కొన్ని రకాల వైద్య సేవలు అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఆస్పత్రిలో అదనపు భవన నిర్మాణం కూడా నేటికి పూర్తి కాలేదు. నిర్మాణం పూర్తయితే గదుల సమస్య తీరుతుంది. 20 బెడ్లతో పాటు, ఆర్థోపెడిక్, కంటి ఆపరేషన్ థియేటర్లు రోగులకు అందుబాటులోకి వస్తాయి. కంటి డాక్టర్, ఆపరేషన్ చేసే మిషనరీ ఉన్నా ఉపయోగం లేకుండా పోతుంది. నవజాత శిశువుల స్థిరీకరణ విభాగంలో మూడు షిఫ్టులలో ముగ్గురు స్టాఫ్ నర్సులు అవసరం. కాగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర స్టాఫ్ నర్సులను ఈ విభాగంలో ఉపయోగిస్తున్నారు. ఆస్పత్రిలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఉన్నా రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆపరేషన్ల సమయంలో రక్తం కోసం నరసరావుపేటకు వెళ్లాల్సి వస్తుంది. 50 పడకలకు ఉన్న 12 మంది పారిశుధ్య కార్మికులే నేటికీ కొనసాగుతున్నారు. సెక్యూరిటీ గార్డులు పది మంది కావాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే ఉన్నారు. 50 పడకలకు సంబంధించిన పారిశుధ్య మెటీరియల్ మాత్రమే వస్తుంది. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆస్పత్రికి అవసరమైన సదుపాయల గురించి వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి వినతి పత్రం అందించారు.

పోస్టులు ఖాళీ..

ఆస్పత్రిలో డాక్టర్ పోస్టులతో పాటు స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదనంగా పారిశుధ్య కార్మికులను, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి. పోస్టులు, సిబ్బంది నియామకం పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఆస్పత్రి అదనపు భవనం ప్రారంభమైతే రోగులకు మరిన్ని వైద్య సేవలు అందించవచ్చు.

\- డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్



ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్‌ఆర్‌ఐ సెకండ్ ఫేజ్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్‌ఆర్‌ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

అడ్మిషన్స్

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

దిక్సూచి

ఏసీఎస్‌ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్‌ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ); పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్

- మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం

రిమైండర్

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల: సెప్టెంబరు 2న
- ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల: సెప్టెంబరు 5
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **వెబ్‌సైట్:** www.kuk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AxmEvBlలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

హీరోగా మారిన విలన్ కథ ఇది




నేను 'మగధీర' చిత్రానికి కో డైరెక్టర్‌గా పని చేశా. ఆ సమయంలోనే దేవ్ గిల్‌తో పరిచయం ఏర్పడింది. దేవ్ ఈ సినిమా ప్రపోజల్‌తో వచ్చాడు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అన్నారు దర్శకుడు త్రికోటి. దేవ్ గిల్ హీరోగా నటించిన 'అహో విక్రమార్క' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నెల 30న ఆ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో దేవ్ గిల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాడు. ఓ విలన్ హీరోగా మారితే ఎలా ఉంటుందనేది ఈ చిత్రకథ అనీ, మదర్ సెంటిమెంట్ కూడా ఉందనీ ఆయన తెలిపారు.

రచయిత నరసింగరావు కన్నుమూత



కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'గులాబి', రామ్‌గోపాల్ వర్మ 'అనగనగా ఒకరోజు' లాంటి పలు హిట్ చిత్రాలకు మాటల రచయితగా పనిచేసిన నడిమింటి నరసింగరావు (72) కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలకు చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

కౌంట్‌డౌన్ మొదలు



ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'పుష్ప 2 ది రూల్' చిత్రం విడుదలకు కౌంట్ డౌన్ మొదలైంది. మరో వంద రోజుల్లో అంటే డిసెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ పేర్కొంటూ పోస్టర్ విడుదల చేశారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకుడు. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. మరో వైపు నిర్మాణానంతర పనులు కూడా శరవేగంతో జరుగుతున్నాయి. 'కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా 'పుష్ప 2' అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. మీరు ఎంత ఎక్స్‌పెక్ట్ చేసినా అంతకు మించి 'తగ్గేదేలే' అనిపించే రీతిలో సినిమా ఉంటుంది' అని దర్శకనిర్మాతలు చెప్పారు. దేవిశ్రీప్రసాద్ పాటలు అలరిస్తాయని తెలిపారు.

అందరి పేర్లు బయటపెట్టాలి



మలయాళ చిత్ర ప్రముఖులపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎఫ్‌ఈఎఫ్‌కేఏ (ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ) దర్శకుల సంఘం ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. జస్టిస్ హేమ కమిటీ నివేదికలో లైంగిక వేధింపులకు పాల్పడిన అందరి పేర్లను బయట పెట్టాలంటూ ఎఫ్‌ఈఎఫ్‌కేఏ దర్శకుల సంఘం డిమాండ్ చేసింది. "ప్రస్తుతం ఈ విషయం కోర్టులో ఉన్నందున దీనిపై ఎక్కువ మాట్లాడాలనుకోవడం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ అందరి పేర్లు బయటకి రావాలి. దోషులకు కఠిన శిక్ష పడాలి. నిందితులలో మా సంఘం సభ్యులున్నా.. మేం కలుగజేసుకోం" అని పేర్కొంది.

సిద్ధిఖీపై కేసు

మలయాళ నటుడు సిద్ధిఖీపై నటి రేవతి సంపత్ లైంగిక ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. అలాగే, బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు ఇండస్ట్రీలో మరీ ఎక్కువ

నటి షకీలా తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. "లైంగిక వేధింపులు కేవలం మలయాళ చిత్రసీమలోనే కాదు.. తమిళ ఇండస్ట్రీలోనూ ఉన్నాయి. తెలుగు ఇండస్ట్రీలో అయితే మరీ ఎక్కువగా ఉన్నాయి. అడ్జస్ట్‌మెంట్లు, కమిట్‌మెంట్ల గురించి మేనేజర్లు ముందే అడుగుతారు" అని ఆరోపించారు.

నోరు విప్పితే ట్రబుల్‌మేకర్స్ ముద్ర

హేమ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి స్వర భాస్కర్. "హేమ కమిటీలో వెలువడిన చీకటి వాస్తవాలు చూసి షాకయ్యా. బాధితులు ఎవరైనా ఏ విషయంపై అయినా నోరు తెరచి మాట్లాడితే వారిని ట్రబుల్‌మేకర్స్‌గా ముద్ర వేస్తారు" అని స్వర భాస్కర్ పేర్కొన్నారు. ప్రతి పరిశ్రమలోనూ మహిళలు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొంటున్నారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అన్నారు. వేధింపులను వెలుగులోకి తెచ్చేందుకు హేమ కమిటీ రిపోర్ట్ ఉపయోగపడిందన్నారు. ఈ నివేదిక మనలో మార్పు తీసుకురావాలి అని ఆమె ఆకాంక్షించారు.

ఇన్ ప్రోగ్రెస్

గన్నూ.. గర్ల్!



శ్రీ సింహా కోడూరి, సత్య ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'మత్తు వదలరా' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. రితీశ్ రానా దర్శకత్వంలో చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నిధి పాత్ర పోషిస్తున్నారు. గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో ఉన్న ఫరియా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సునీల్, వెన్నెల కిశోర్, అజయ్, రోహిణి తదితరులు నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది.

సెప్టెంబర్‌లో జిగేల్



త్రిగుణ్, మేఘనా చౌదరి జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'సెప్టెంబర్‌లో 'జిగేల్' చిత్రాన్ని విడుదల చేస్తాం. యువతను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోంది' అని నిర్మాతలు చెప్పారు. రఘుబాబు, పృథ్వీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఆనంద్ మంత్ర

నీలి మేఘములలో...



రానా దగ్గుబాటి సమర్పణలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం సెప్టెంబర్ 6న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. లీడ్ పెయిర్ జర్నీని అందంగా ఆవిష్కరిస్తూ భరద్వాజ్ గాలి రాసిన 'నీలి మేఘములలో' పాటను బుధవారం విడుదల చేశారు. వివేక్ సాగర్ ఈ గీతానికి స్వరాలు అందించారు.

ప్రేమికుడి వీక్షణం



యువ కథానాయకుడు రామ్ కార్తీక్ హీరోగా, కశ్వి హీరోయిన్‌గా నటించిన 'వీక్షణం' చిత్రం తొలి కాపీతో విడుదలకు సిద్ధమైంది. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం సిద్ శ్రీరామ్ పాడిన 'ఎన్నెన్నో' పాటను విడుదల చేశారు. ప్రేమలో మునిగిన ప్రేమికుడి మనసుని ఆవిష్కరించే ఈ పాటను రెహ్మాన్ రాయగా, సమర్థ్ గొల్లపూడి స్వరాలు సమకూర్చారు.

సాధనకు దీక్ష అవసరం



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'దీక్ష' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. కిరణ్ కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటించిన ఈ చిత్రాన్ని పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాం.' అని కోరారు. ఒక మంచి సినిమాలో అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో, హీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరంతో జలసిరులు కురిపించడమే లక్ష్యం


ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, ఆగస్టు 28: జాతీయ ప్రాజెక్టు, ఆంధ్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చెల్లించాల్సిన బకాయిలతో పాటుగా, అవసరమైన నిధులను సమకూర్చి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు.. కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయటంపై టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైన పోలవరం ప్రాజెక్టుకు మేలు చేస్తున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రానికి జలసిరులు కురిపించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన ఆవశ్యకతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అనేకమార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలకు విన్నవించారని గుర్తుచేశారు. కూటమి ఎంపీలు పార్లమెంట్‌లో ఈ ప్రాజెక్టు పూర్తి గురించి లేవనెత్తారని ఎంపీ పేర్కొన్నారు.

ముఖద్వారాన్ని ప్రారంభించిన మంత్రి లోకేశ్


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఆగస్టు 28: మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి సంబంధించి ఉత్తర వీధిలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం ఉదయం ప్రారంభించారు. దాత తుల్లిమిల్లి రామకృష్ణ, శాంతి దంపతులు సుమారు రూ.35 లక్షలు వెచ్చించి ఈ ముఖద్వారాన్ని నిర్మించారు. మంత్రి నారా లోకేశ్ అర్చిని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు 1 వరకు సెలవు

తాడేపల్లి, ఆగస్టు 28: మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమం ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహించడం లేదని, తదుపరి తేదీలు ఒక రోజు ముందుగా తెలియజేస్తామని ప్రజలకు నారా లోకేశ్ కార్యాలయం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. అర్జీదారులు గమనించి సహకరించాలని కోరారు.

రాగులు ఇక స్టాక్ వస్తేనే..!

- ఈ నెల వరకు గుంటూరు, మంగళగిరి, తెనాలిలో పంపిణీ
- ఒక్కో కుటుంబం 3 కేజీల వరకు తీసుకోవచ్చు
- ఆ మేరకు బియ్యాన్ని మినహాయిస్తారు
- కార్డుదారులందరికీ చక్కెర పంపిణీ పునరుద్ధరణ



గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో సేకరించిన రాగులులో సుమారు 96 టన్నులను పౌరసరఫరాల సంస్థ జిల్లాకు కేటాయించింది. ఈ స్టాకు జిల్లాలోని రేషన్‌కార్డుదారులందరికీ సరిపోయే పరిస్థితి లేకపోవడంతో రాగులు ఎక్కువగా వినియోగించే గుంటూరు, తెనాలి, మంగళగిరి అర్బన్ ప్రాంతాల్లోని కార్డుదారులకు పంపిణీ చేయాలని ఆ శాఖ నిర్ణయించింది. అది కూడా ఒక్కో షాపునకు 200 కేజీలు మాత్రమే ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే ఆ షాపు పరిధిలో 100 మంది కార్డుదారులకు పంపిణీ చేసే నిల్వలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఒక్కో కుటుంబానికి 3 కేజీల చొప్పున రాగులు కోరుకొన్న వారికి ఇచ్చి ఆమేరకు బియ్యాన్ని మినహాయిస్తారు. వచ్చే నెల ప్రభుత్వం నుంచి స్టాకు వస్తే దీనిని కొనసాగిస్తామని పౌరసరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ తెలిపారు.

వైసీపీ హయాంలో గాడి తప్పింది..

వైసీపీ ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. అంతకుముందు వరకు ప్రతీ నెలా బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార తప్పనిసరిగా పంపిణీ చేసేవారు. పలు సందర్భాల్లో గోధుమలు, గోధుమ పిండి, పామాయిల్ వంటివి కూడా సరఫరా చేసి పేదలకు అండగా నిలిచేశారు. ఇక పండగల సమయంలో మరిన్ని సరుకులు ఇచ్చేవారు. ఒకానొక దశలో రేషన్ షాపులను చంద్రన్న మాల్స్‌గా కూడా మార్పు చేసి అన్నిరకాల సరుకులు సరసమైన ధరలకే లభ్యమయ్యేలా చేయాలని భావించారు. ఎప్పుడైతే వైసీపీ అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి పౌరసరఫరాల వ్యవస్థ నీరుగారిపోయింది. సన్నబియ్యం, డోర్ డెలివరీ మాట దేవుడెరుగు. అప్పటి వరకు ఇచ్చిన సరుకులను ఒక్కొక్కటిగా కోత పెడుతూ వచ్చి చివరికి బియ్యం పంపిణీకి మాత్రమే ఈ వ్యవస్థని పరిమితం చేసింది.

సెప్టెంబర్ నుంచి చక్కెర..

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ పౌరసరఫరాల వ్యవస్థని గాడిన పెట్టే పనికి శ్రీకారం చుట్టింది. ఎండీయూ ఆపరేటర్ల వలన ఎలాంటి ఉపయోగం లేకపోతుండటంతో ఆ వ్యవస్థ రద్దు దిశగా చర్యలు చేపడుతున్నది. అలానే ఎన్నో నెలల నుంచి పంపిణీ చేయకుండా నిలిపేసిన చక్కెరని సెప్టెంబరు నెల నుంచి కార్డుదారులకు ఇచ్చేందుకు అవసరమైన స్టాకుని సమృద్ధిగా తెప్పించారు. అలానే రాయలసీమ జిల్లాల్లో మిగిలిపోయిన రాగుల స్టాకును కూడా తెప్పించి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

చంద్రబాబు.. పవన్ పర్యటన ఇలా..

- నరసరావుపేట జేఎన్‌టీయూలో భారీగా ఏర్పాట్లు

నరసరావుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవణ్ కళ్యాణ్ నరసరావుపేట పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నరసరావుపేట మండలంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాల ప్రాంగణంలో 30న జరగనున్న వనమహోత్సవంలో చంద్రబాబు, పవన్ పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం 10.10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బయలుదేరుతారు. 10.30 గంటలకు జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు వస్తారు. 10.45 గంటలకు వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటుతారు. అనంతరం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 12.45 గంటలకు బహిరంగ సభ ముగుస్తుంది. 12.50 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని ఉండవల్లి బయలుదేరి వెళ్తారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ పర్యవేక్షించారు. బహిరంగ సభ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

18 క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల


నాగార్జున సాగర్ నుంచి విడుదల అవుతున్న నీరు

మాచర్ల రూరల్, ఆగస్టు 28: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 18 క్రస్ట్ గేట్ల ద్వారా బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 18 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,45,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,330 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948 క్యూసెక్కులు, 18 క్రస్ట్ గేట్ల ద్వారా 1,45,800 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,94,788 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,94,758 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 36,500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 28: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 53,520 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 17,020 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17,020 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

1.0321 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 28: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ 9 క్రస్ట్‌గేట్లను 2.5 మీటర్ల ఎత్తి పులిచింతలకు 1,23,470 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు, ఇందులో క్రస్ట్ గేట్ల ద్వారా 1,15,317, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,153 క్యూసెక్కుల నీటిని పంపుతున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 1,24,000క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0321 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7.011 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.40 మీటర్లకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 28: పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 65,878 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 88,818 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా, దీనిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతుందని తెలిపారు.

దివ్యక్షేత్రంగా వైకుంఠపురం అభివృద్ధి

- సంప్రోక్షణ పూజల్లో మంత్రి మనోహర్


ఆలయ శిఖరంపై పవిత్ర జలాలు సమర్పిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఆగస్టు 28: వైకుంఠపురం ఆలయాన్ని దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శ్రీలక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాసంప్రోక్షణ పూజల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఆలయంలో నిర్మించిన గోపురాలు, శిఖర ప్రతిష్ఠ, జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ, హోమాల కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. మంత్రికి తొలుత పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం గోపుర శిఖర కలశాలపై పూజలు, హోమంలో పూర్ణాహుతి, మహాదాశీర్వచనం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు చేయూత అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన నిధులు ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కేంద్రంలో కూడా మంత్రిగా ఈ ప్రాంత వాసి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారని, వారి సహకారంతో పాటు రాష్ట్ర దేవాదాయ శాఖ నుంచి కూడా నిధులను తెచ్చి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. తెనాలి ప్రాంతానికి పూర్వ వైభవం వచ్చేలా అన్నివర్గాలు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈవో తిమ్మానాయుడు, డీఎస్పీ జనార్ధన్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కె.సాయిబాబు, కమిటీ సభ్యులు, అర్చకులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రేంజ్ పరిధిలో ఐదుగురు సీఐలకు పోస్టింగ్స్

గుంటూరు, ఆగస్టు 28 : రేంజ్ పరిధిలో ఐదుగురు సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ ఐజీ ఎస్ ఎస్ త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఆయా సీఐల వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల డీటీసీలో ఉన్న సీహెచ్ సింగయ్యను గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐగా నియమించారు. ఏసీబీలో ఉన్న బి .రవీంద్రబాబును ఫిరంగిపురం సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.భాస్కర్‌ను గురజాల సీఐగా నియమించారు. కృష్ణపట్నం పోర్టు సీఐ కె.వెంకటరెడ్డిని నెల్లూరు సౌత్ ట్రాఫిక్ సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న కె.రామకృష్ణను నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సీఐగా నియమించారు.

అమ్మవారికి బంగారు వడ్డాణం బహూకరణ


ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న వడ్డాణం

కారంపూడి, ఆగస్టు 28: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఓ కుటుంబం రూ.30 లక్షలు విలువ చేసే వజ్రాలతో పొదిగిన బంగారు వడ్డాణాన్ని కానుకగా సమర్పించారు. కారంపూడికి చెందిన సాయి బాలాజీ జ్యూవెలరీస్ ప్రొప్రైయిటర్ యేచూరి సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, వారి కుమారుడు శ్రీగోల్డ్ డైమండ్స్ ఎండీ యేచూరి మణిదీప్, స్పందన దంపతులు, వారి కుమార్తెలు ఈషా, అక్షశ్రీలు కుటుంబ సమేతంగా బుధవారం అమ్మవారి ఆలయానికి వచ్చారు. వారు తయారు చేయించిన బంగారు వడ్డాణాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ముందుగా ఆ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజారి మణికంఠ ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థాన అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసుల్లో జైలు శిక్ష

మంగళగిరి, ఆగస్టు 28: రెండు వేర్వేరు చెల్లని చెక్కు కేసులకు సంబంధించి నిందితులకు జైలు శిక్ష, కాంపెన్‌సేషన్ చెల్లించాలని ఆదేశిస్తూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె సురేష్‌బాబు బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.

రైతును మోసగించిన కేసులో...

మంగళగిరిలోని కొండపనేని టవర్స్‌లో ఉంటున్న నాగళ్ల రవీంద్రబాబు అనే రైతు నుంచి భట్టిప్రోలుకు చెందిన అక్షయ ఫర్టిలైజర్స్ ప్రొప్రైయిటర్ మాదల ప్రవీణ్‌రాజు వ్యాపారం నిమిత్తం 1830 కిలోల మొక్కజొన్నను రూ.6,10,400లకు 2021లో కొనుగోలు చేశారు. అనంతరం పార్ట్ పేమెంట్ కింద రూ.5,80,000లకు చెక్కు ఇవ్వగా, సదరు చెక్కును ఫిర్యాది రవీంద్రబాబు మంగళగిరిలోని ఐసీఐసీఐ బ్యాంకులో వేయగా చెక్ బౌన్సు అయింది. అనంతరం రవీంద్రబాబు మంగళగిరి కోర్టులో ప్రవీణ్‌రాజుపై ఎన్ఐ యాక్టు కింద కేసు దాఖలు చేయగా వాదోపవాదాల అనంతరం నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5,80,000లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సురేష్‌బాబు తీర్పు చెప్పారు.

మరో కేసులో..

మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన అవుతు శ్రీనివాసరెడ్డి నుంచి వలివేరుకు చెందిన బి.అరుణారెడ్డి 2018లో రూ.3 లక్షలు నగదు తీసుకుని పార్ట్ పేమెంట్ కింద రూ.3 లక్షలకు చెక్కు ఇవ్వగా, ఫిర్యాది ఆ చెక్కును నూతక్కి బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వేయగా బౌన్సు అయింది. శ్రీనివాసరెడ్డి మంగళగిరి కోర్టులో అరుణారెడ్డిపై ఎన్ఐ యాక్ట్ కింద కేసు దాఖలు చేయగా వాదోపవాదాల అనంతరం నిందితురాలికి ఆర్నెల్లు జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సురేష్‌బాబు తీర్పు చెప్పారు.

దారి దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

పెదకాకాని, ఆగస్టు 28: హైవేపై దారి దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నగరం పట్టాభిపురం సమీపంలోని ఫాతిమానగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వచ్చే జీతం చాలక దారి దోపిడీలకు పాల్పడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో తక్కెళ్లపాడు బైపాస్ వద్ద హైవేపై రెండు పర్యాయాలు ద్విచక్ర వాహనదారులను బెదిరించి ఒకరి వద్ద రూ. లక్ష, మరొకరి వద్ద రూ.4 లక్షలు దోపిడీ చేశాడు. అదేవిధంగా పెదకాకాని సమీపంలోని శివారు ప్రాంతాల్లో ఒక వ్యక్తిని బెదిరించి రూ 6,700 దోచుకున్నాడు. మూడు కేసుల్లో నిందితుడైన సుబ్రహ్మణ్యాన్ని కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు బైకు దొంగల అరెస్టు

చిలకలూరిపేట, ఆగస్టు 28: చిలకలూరిపేట, నరసరావుపేటలలో బైక్ దొంగతనాలకు పాల్పడిన చిలకలూరిపేటకు చెందిన నలుగురు యువకులను చిలకలూరిపేట అర్బన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక వైయస్సార్ కాలనీ ప్రాంతంలో అరెస్టు చేసిన వారి వద్ద నుంచి ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో జూపూడి రాజేష్ (సాంబశివనగర్), షేక్ అబ్దుల్ బాషా (మదర్ థెరిస్సా కాలనీ), పాలడుగు నాగేశ్వరరావు (మదర్ థెరిస్సా కాలనీ), దాసరి వెంకటేశ్వర్లు (మదర్ థెరిస్సా కాలనీ) ఉన్నారు. అర్బన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో అర్బన్ ఎస్ఐ డి.చెన్నకేశవులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపారు.

12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష



మాట్లాడుతున్న చాంద్ బాషా, పక్కన ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28: ప్రభుత్వ ఉద్యోగులకు 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష కోరారు. బుధవారం సంఘ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేతన సవరణ ముగిసి 14 నెలలు గడచినా 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవటం దురదృష్టకరమన్నారు. కమిటీని నియమించలేని పక్షంలో 29 శాతం మధ్యంతర భృతి ప్రకటన చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు 14 నెలలు నష్టపోయారని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని వేతన సవరణ కమిషన్‌ను తక్షణమే నియమించాలని కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు కరీముల్లా షాఖాదరి, నాగేశ్వరరావు, పెద రత్తయ్య, రాజబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు మత మార్పిడి చేసే వారిని శిక్షించాలి


డాక్టర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరుటౌన్, ఆగస్టు28: బలవంతపు మత మార్పిడిలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ మోసిగంటి ప్రభుత్వాని బుధవారం కోరారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో మత మార్పిడిలు ఎక్కువ జరిగాయని విమర్శించారు. పదవుల కోసం మతం మారిన వారిని కూడా కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఆధ్యాత్మికతను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. బలవంతపు మత మార్పిడిలు పాస్టర్లు కానీ, క్రైస్తవులు కానీ చేయరన్నారు. బైబుల్ ప్రకారం మత ప్రచారం మాత్రమే చేయాలని మార్పిడి చేయకూడదన్నారు. రాజకీయ క్రైస్తవ నామినేటెడ్ పదవుల కోసం బలవంతపు మత మార్పిడిలు జరిగాయనేది వాస్తవం అన్నారు. రాష్ట్రంలో మైనార్టీలకు 800 నామినేటెడ్ పదవులు ఉండగా అధిక భాగం ముస్లింలకు కేటాయించారని అన్నారు. మిగిలిన వాటిలో ఎక్కువగా క్రైస్తవేతరులను క్రైస్తవులుగా మార్చి ఆ కోటాలో పదవులు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వంలో అందరి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

54,615 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 57,286 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 54,615 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 20,873 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	9000	15000
నెంబరు. 5	9100	13000	నెంబరు. 5	11000	11000
273	11200	13000	273	12500	12500
341	8000	15000	341	9000	13000
4884	8000	15000	4884	11000	15700
సూపర్ 10	10000	11600	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	8000	18600
బ్యాడిగి	8000	17000	బ్యాడిగి	10000	16000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	10000	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

ఏకాభిప్రాయంతోనే నియామకం

● 'ట్రస్టుబోర్డు లేని సత్రశాల ఆలయం' కథనంపై ఎమ్మెల్యే వివరణ



ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

రెంటచింతల,ఆగస్టు 28 : సత్రశాల ట్రస్టు బోర్డు చైర్మన్, డైరెక్టర్ల నియామకాన్ని అందరి ఏకాభిప్రాయం ద్వారా ఎంపిక చేస్తామని, పార్టీలో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 'ట్రస్ట్‌బోర్డు లేని సత్రశాల ఆలయం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పందించారు. గుంటూరులో వున్న ఎమ్మెల్యే ఆంధ్రజ్యోతి విలేకరుతో ఫోన్‌లో మాట్లాడుతూ.. సత్రశాల ట్రస్టు బోర్డు కమిటీ ఎంపికలో మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికే ప్రాధాన్యం ఉంటుందన్నారు. అలాగే సత్రశాల అభివృద్ధి గురించి దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చించినట్లు పేర్కొన్నారు. పాలు వాయిజంక్షన్ నుంచి సత్రశాల వరకు రహదారి మరమ్మతుల నిమిత్తం రూ.40 లక్షలు కేటాయించగా మంగళవారం టెండర్ల ప్రక్రియ పూర్తైందన్నారు. మరో రూ.78 లక్షలకు సంబంధించి జంక్షన్ నుంచి తుమ్మకోట, మిట్టగుడిపాడు నుంచి గొట్టిముక్కల, గోలి గ్రామ సమీపంలో వంతెననకు మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణానికి పనులు సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమౌతాయన్నారు.

పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ

పెదకూరపాడు, ఆగస్టు 28 : పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి కర్రలతో కొట్టుకున్న సంఘటన మండలంలోని లగడపాడులో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన షేక్ హసన్ బాజీ, షేక్ మహమ్మద్ జానీలు వాటర్ ప్లాంట్ వద్దకు నీటి కోసం వెళ్ళిన చోట గొడవ పడటంతో అక్కడ ఉన్న వారు సర్దిచెప్పటంతో ఇంటికి వెళ్ళారు. రాత్రి వారి వర్గీయులతో పాత కక్షలను కూడా దృష్టిలో పెట్టుకొని ఒకరికొకరు కర్రలతో కొట్టుకున్నారు. ఈ సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. డీఎస్పీ గురునాథబాబు, సీఐ సురేష్, పెదకూరపాడు ఎస్ఐ బాలునాయక్‌లు ఆ గ్రామానికి వెళ్ళి ఇరువర్గాల వారితో మాట్లాడారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశారు.

మనీషా కుటుంబీకుల ఆరోపణలు అవాస్తవం

● రేషన్‌షాపు లాగేసుకున్నారన్నది అబద్ధం : తహసీల్దార్

పిడుగురాళ్ల, ఆగస్టు 28: రేషన్‌షాపును బలవంతంగా లాగేసుకున్నారని రెవెన్యూ అధికారులపై మనీషా చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తహసీల్దారు మధుబాబు బుధవారం తెలిపారు. తహసీల్దారు తెలిపిన వివరాల ప్రకారం.. జూలకల్లు గ్రామంలోని 49వ నెంబరు రేషన్‌షాపు డీలర్ రామయ్య పది నెలల క్రితమే మృతి చెందిగా, ఆయన భార్య కుమారి, కుమార్తె మనీషాలు ఆ రేషన్‌షాపు నిర్వహిస్తున్నారు. కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయటంలేదని ఆరోపణలు రావడంతో తనిఖీలు చేపట్టగా లెక్కల్లో వ్యత్యాసం వుండటాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. మంగళవారం కూడా మనీషా సమక్షంలోనే 49వ నెంబర్ రేషన్‌షాపులో సెప్టెంబరు రేషన్ సరుకు దిగుమతి జరిగింది. కాగా కాలనీలో వారి బంధువుల మధ్య వున్న వివాదంతో మనీషా గుంటూరు బ్రాంచి కెనాల్ వద్ద చెప్పులు వుంచి లేఖ రాసి అదృశ్యం అయింది. మంగళవారం రాత్రి పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా ఆమె జాడ తెలియలేదు. బుధవారం ఉదయం మనీషా నరసరావుపేటలోని బంధువుల ఇంట్లో ఉండగా నరసరావుపేట పోలీసులు గుర్తించారు. ప్రజలను, రెవెన్యూ అధికారులను మనీషా కుటుంబ సభ్యులు కావాలనే తప్పుదారి పట్టించినట్లు తహసీల్దార్ మధుబాబు పేర్కొన్నారు.



పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నాయకులు

శవ రాజకీయాలు చేయొద్దు

● మాజీ ఎమ్మెల్యే కాసుపై టీడీపీ ఎస్సీ సెల్ నేతల మండిపాటు

పిడుగురాళ్ల, ఆగస్టు 28: మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు శవ రాజకీయాలు చేయటం ఇకనైనా మానుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ధ్వజ మెత్తారు. బుధవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎస్సీసెల్ కార్య నిర్వాహక కార్యదర్శి పణితి రవి మాట్లాడుతూ.. జూలకల్లు ఎస్సీ కాలనీకి చెందిన లంజేపల్లి మనీషా విషయంలో నిజానిజాలు తెలుసుకోకుండా ఆమె నుంచి బలవంతంగా రేషన్‌షాపు లాగేసుకున్నారని, ఆమెను ఆత్మహత్యకు పురిగొల్పారని టీడీపీ నేతలపై మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారన్నారు. ఇప్పుడు మనిషా సురక్షితంగా బంధువుల ఇంటిలో ప్రత్యక్షం గావడంతో నిజానిజాలు తెలుసుకోకుండా తొందరపాటు వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే కాసు అబాసు పాలయ్యారన్నారు. అయినా వైసీపీ ఐదేళ్ల పాలనలో గురజాల నియోజకవర్గంలో ఎందరో దళితులను హత్య చేయించి అక్రమ కేసులు పెట్టించిన కాసు మహేష్‌రెడ్డి ఇప్పుడు ఎవరికో అన్యాయం జరిగిపోయిందంటూ నీతివాక్యాలు వల్లించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎస్సీ సెల్ నాయకులు కొండలు, మందా డేవిడ్, వర్ల రత్నంలు మాట్లాడుతూ కాసు మహేష్ రెడ్డి ఆరోపించినట్లుగా మనీషా రేషన్ దుకాణం ఎవరూ లాగేసుకోలేదని, రేషన్ సరుకులన్నీ మనీషా కుటుంబ సభ్యులకే అందజేశారని రెవెన్యూ అధికారులే తెలిపారని, దీనిపై కాసు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సమావేశంలో గుండాల ఆనంద్, కరుణాకర్, మార్క్, తదితరులు పాల్గొన్నారు.

జూలకల్లు ఘటనలో అబాసుపాలైన వైసీపీ నేతలు

జూలకల్లు యువతి అదృశ్యంపై కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు అక్రమ కేసులు పెట్టారని, రేషన్ డీలర్‌షిప్ లాగేసుకున్నారని టీడీపీ నేతలపై నిరాధార ఆరోపణలుచేసి అబాసుపాలయ్యారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తురకా వీరస్వామి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలి దుయ్యబట్టారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాసు మహేష్‌రెడ్డి నిజాలు తెలుసుకోకుండా, నిరాధార ఆరోపణలు చేసి మాట్లాడటాన్ని ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

గ్రామాల్లో జ్వరాలు

● ప్రతి ఊరిలో పదుల సంఖ్యలో జ్వరపీడితులు
● ఇంటింటికీ తిరిగి వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది
● పలు ప్రాంతాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు



ఊటుకూరు వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

క్రోసూరు, ఆగస్టు 28 : మండలంలోని ఐదు గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో జ్వర పీడితులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

మండలంలోని బయ్యవరం, ఊటుకూరు గ్రామాల్లో నాలుగు రోజులుగా జ్వర పీడితులు అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. నాగవరం, ఆవులవారిపాలెం, దొడ్లేరు గ్రామాల్లో కూడా జ్వరాలు సోకిన వారి సంఖ్య అధికంగా ఉండటంతో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి వైద్య సేవలు అందజేస్తున్నట్లు అక్కడి పీహెచ్‌సీ డాక్టర్లు సిరి చందన, డాక్టర్ సాద్ తెలియజేశారు. 88 తాళ్ళూరు, నాగవరం గ్రామాల్లోనూ జ్వర పీడితులు అధిక సంఖ్యలో స్థానికులు చెబుతున్నారు.

మండల కేంద్రం క్రోసూరులో జ్వరాలతో అనేక మంది బాధపడుతున్నారు. వారంతా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆర్ఎంపీ డాక్టర్ల వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకుంటున్నారు. బయ్యవరం, ఊటుకూరు గ్రామాల్లో వైద్య ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరాల బారినపడిన వారి నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నట్టు తెలియజేశారు. గ్రామంలో సుమారు 150 మందిని పరీక్షించామని, ఇప్పటి వరకు మొత్తం 25 కేసుల వరకు జ్వర పీడితులు నమోదైనట్టు సూపర్ వైజర్ శివుడు తెలియజేశారు. ఆరోగ్య శిబిరాల్లో హెల్త్ అసిస్టెంట్ ప్రేమ్‌రాజు, ఏఎన్ఎం మరియమ్మ, ఆషా వర్కర్లు వైద్య సేవల్లో పాల్గొంటున్నారు.



ముక్త్యాల రాజాకు నివాళులర్పిస్తున్న కేసీపీ ఉద్యోగులు

ముక్త్యాలరాజా విగ్రహానికి నివాళి

మాచర్ల రూరల్, ఆగస్టు 28: మండలంలోని విజయపురిసౌత్ పార్కు సెంటరులో బుధవారం కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆధ్వర్యాన ముక్త్యాలరాజా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్త్యాల రాజా విగ్రహానికి కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి మూలపురుషుడు ముక్త్యాలరాజా అని, బంజరు భూములుగా ఉన్న పొలాలు సిరులు పండించే భూములుగా మారడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కేసీపీ సీనియర్ డీజీఎంలు కే.రామకోటేశ్వరరావు, కే.ఆనందరెడ్డి, హెచ్‌వోడీ జీ.శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ శివయ్య, జనరల్ సెక్రటరీ జీఎల్ నారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పీఎం జన్‌మన్' సభలు

వెల్దుర్తి, ఆగస్టు 28: మండలంలోని హనుమపురం, రామచంద్రారెడ్డి చెంచుగూడెంలలో బుధవారం 'పీఎం జన్‌మన్' గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ మాటాడుతూ చెంచు గిరిజనుల సంక్షేమం, అభ్యున్నతి కోసమే ఈ గ్రామసభల ముఖ్య ఉద్దేశ్యమని, వీటిని సద్వినియోగంచేసుకోవాలని ఆయన గ్రామస్థులకు సూచించారు. ఈ గ్రామసభల్లో హార్టికల్చర్ ఆఫీసర్ సురేష్, ఐడీటీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: మండలంలోని ఎత్తిపోతల చెంచుకాలనీ, వీరాంజనేయపురం, తాళ్లపల్లి గ్రామాల్లో బుధవారం పీఎం జన్‌మన్ గ్రామ సభలు నిర్వహించారు. తాళ్లపల్లిలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ పసుపులేటి బ్రహ్మానాయుడు మాట్లాడుతూ అందరికీ ఇళ్లు, ఇంటింటికి మంచినీటి కుళాయి, గ్రామాలకు రహదారులు, ప్రతి ఇంటికి విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి మోదీ జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇద్దరిపై హత్యాయత్నం కేసు

రెంటచింతల, ఆగస్టు 28: మద్యం మత్తులో ఏర్పడిన వివాదంలో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఇద్దరిపై హత్యాయత్నం 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రాత్రి రెంటాలలో అదే గ్రామానికి చెందిన జనార్థనరెడ్డి, చెన్నారెడ్డి, మంచికల్లు గ్రామానికి చెందిన కే.అంజిరెడ్డిలు కలసి మద్యం తాగారు. ఆక్రమంలో వారి ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీయడంతో అంజిరెడ్డిపై జనార్థనరెడ్డి, చెన్నారెడ్డిలు కలసి దాడిచేశారు. ఈ ఘటనలో బాధితుడు అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

గురజాల కమిషనర్‌గా చెన్నయ్య



కమిషనర్ చెన్నయ్య

గురజాలటౌన్, ఆగస్టు 28: గురజాల నగర పంచాయతీ కమిషనర్‌గా చెన్నయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు నుంచి బదిలీపై గురజాలకు వచ్చారు. ఇప్పటి వరకు గురజాల్లో విధులు నిర్వహించిన శ్రీనివాసరావు హిందూపురంకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చెన్నయ్యకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలుపుతూ స్వాగతం పలికారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

దాచేపల్లి, ఆగస్టు28: పొందుగలలోని రాష్ట్ర పోలీసు చెక్‌పోస్టు వద్ద దాచేపల్లి పోలీసులు బుధవారం సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా తరలిస్తున్న తెలంగాణా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జానపాడు గ్రామానికి చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తి తెలంగాణ మద్యం 192 క్వార్టర్ సీసాలు పిడుగురాళ్ల మండలం జానపాడుకు తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందన్నారు. ఈ ఘటనలో నిందితుడు కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కమిషనర్ అప్పారావుకి సత్కారం

సత్తెనపల్లి, ఆగస్టు 28 : సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఆర్ఐగా పని చేస్తూ బదిలీపై దాచేపల్లి మునిసిపల్ కమిషనర్‌గా వెళ్తున్న అప్పారావును బుధవారం పురపాలకసంఘ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ షమ్మి ఆధ్వర్యంలో పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ షమ్మి మాట్లాడుతూ విధి నిర్వాహణలో అప్పారావు సేవలు మరువలేనివ న్నారు. కార్యక్రమంలో డీఈ మధుసూదన రావు, ఇతర మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ గోడౌన్‌లో తహసీల్దారు తనిఖీ

పెదకూరపాడు, ఆగస్టు 28: పెదకూరపాడులోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో నిల్వవున్న అమరావతి, పెదకూరపాడు మండలాలకు చెందిన చౌకడిపోల బియ్యాన్ని బుధవారం తహసీల్దారు డానియేలు తనిఖీ చేశారు. గోడౌన్‌లోని రికార్డులను పరిశీలించి సివిల్ సప్లయి ఇన్‌చార్జి డీటీని సరుకు వివరాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. పురుగు మందుల షాపుల్లోనూ తనిఖీలు నిర్వహించారు. ఆయనవెంట వీఆర్వో శిలువకుమార్, సిబ్బంది ఉన్నారు.



రంగు రాళ్ళ కోసం వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ సురేష్

రంగు రాళ్లు, వజ్రాల వేటకొస్తే చర్యలు

● నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ ● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నకరికల్లు, ఆగస్టు 28 : రంగు రాళ్లు, వజ్రాల వేట కోసమని ఎవరైనా ప్రభుత్వ భూముల్లోకి వస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ హెచ్చరించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'రంగురాళ్ళ కోసం వేట' శీర్షికన ప్రచురితమైన కథనంపై నకరికల్లు ఎస్ఐ సురేష్ స్పందించారు. వెంటనే ఆయన త్రిపురాపురం కొండ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రంగు రాళ్లు, వజ్రాల కోసం వెతుకులాడుతున్న వారిని కలిసి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న రంగు రాళ్ళ వార్తలను చూసి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో త్రిపురాపురం కొండ వద్దకు అనేక మంది వస్తున్నారని, ఆయా వార్తలను ఎవరూ నమ్మవద్దని, కాదని వస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. అనంతరం కొండ వద్ద 'రంగు రాళ్ళ కోసం రావద్దు' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు.



విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్ సతీమణి లావణ్య

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

రాజుపాలెం, ఆగస్టు28 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ రామలింగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజుపాలెం మండల పరిసర ప్రాంత గ్రామాల్లోని ప్రభుత్వ ఉద్యోగస్థులు ఈ వైద్యశిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ వైద్యశిబిరం ఉదయం 10గంటలకు ప్రారంభమైతుందని, ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డు ఉన్న వారికి అన్ని రకాల కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9133667555 ఫోన్ నంబరును సంప్రదించాలని డాక్టర్ రామలింగారెడ్డి కోరారు.

పేకాట స్థావరాలపై దాడులు

● 11 ద్విచక్రవాహనాలు, 10 సెల్ ఫోన్‌లు స్వాధీనం

క్రోసూరు, ఆగస్టు 28 : మండలంలోని హసానాబాద్, పెరికపాడు కొండల్లో పేకాటస్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించి, 10 మంది నిందితులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 11 ద్విక్ర వాహనాలు, 10 సెల్ ఫోన్‌లు, రూ.47,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మహమ్మద్ షఫీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తుతోపాటు నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎస్ఐ మహమ్మద్ షఫీ తెలియజేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టామహోత్సవం

అచ్చంపేట, ఆగస్టు 28 : మండల కేంద్రమైన అచ్చంపేటలోని ఎస్సీ కాలనీలో ఏకలవ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కొల్హాపురి పోలేరమ్మ, పోతురాజు విగ్రహప్రతిష్టా మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రతిష్టా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, బత్తుల శ్రీనివాసరావు, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

వెల్దుర్తి, ఆగస్టు 28: ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి రామాలయం సెంటర్లో బుధవారం ఆయన వాహనదారులు, గ్రామస్థులతో మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు అప్పగించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్లు నడిపే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. ప్రయాణంలో లైసెన్సుతో పాటు వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్ఐ సూచించారు.

ఆరు నెలలుగా జీతాల్లేవు !

● సత్తెనపల్లి ఏరియా వైద్యశాల పారిశుధ్య కార్మికుల వ్యథ

సత్తెనపల్లి, ఆగస్టు 28 : సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పని చేసే కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ఆరు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా వైద్యశాలలో ప్రస్తుతం 12 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. వారికి ప్రతి నెల రూ. 12వేలు వేతనాన్ని సదురు కాంట్రాక్టు సంస్థ చెల్లించాలి. కానీ జీతాలు సకాలంలో అందకపోవడంతో నిరుపేద కార్మిక కుటుంబాలకు చెందిన వీరు కుటుంబాల పోషణ కోసం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక చేసేదేమీ లేక అధిక వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. జీతాల చెల్లింపు విషయమై గత వైసీపీ హయాంలోనే ఆపార్టీ నేతలకు, అధికారులకు, సంబంధిత కాంట్రాక్టరుకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు అందకపోవటంతో తమ బాధలు వర్ణనాతీతం అని చెపుతున్నారు. దీని పై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు జీతాల బకాయిలు ఉన్న మాట వాస్తవమేనన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రిలోని పారిశుధ్య కార్మికులు (ఫైల్)

లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు సీఎం కృషి

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 28 : రాజధాని అభివృద్ధిలో భాగంగా పల్నాడుజిల్లాలో లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. బుధవారం ఆయన గుంటూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. పల్నాడులో లాజిస్టిక్‌పార్కు ఏర్పాటు ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డును ఆను కొనివున్న పెదకూరపాడు, అమరావతి మండలాల్లో లాజిస్టిక్‌పార్కు ఏర్పా టుతో ఇంతర రంగాల పరిశ్రమల స్థాపనకు అవకాశం ఏర్పడుతుందన్నారు. దీంతో నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఎన్ని కల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా తీర్చిదిద్దేలా కృషిచేస్తున్నారని, ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేలా లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు.



కళాశాల గుర్తింపు కరపత్రాలను చూపుతున్న శ్రీనివాసరెడ్డి తదితరులు

న్యూటన్స్ కళాశాలకు నాక్ గుర్తింపు

మాచర్లటౌన్, ఆగస్టు 28: మాచర్ల పట్టణ శివారులోని న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు నేషనల్ అస్సెస్‌మెంట్, అక్రిడేషన్ కౌన్సిల్ గుర్తింపు లభించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కళాశాలలో నాక్ గుర్తింపు పత్రాలను విడుదల చేశారు. జూన్ 25, 26 తేదీల్లో నేషనల్ అస్సెస్‌మెంట్, అక్రిడేషన్ కౌన్సిల్ సభ్యులు కళాశాలను సందర్శించి తరగతి గదులు, లేబొరేటరీస్, గ్రంథాలయం, స్పోర్ట్స్ గేమ్స్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెల్, పరీక్షా కేంద్రం, హాస్టల్, ఆర్వో ప్లాంటు, సోలార్, బయోగ్యాస్ రెన్యూవల్ ఎనర్జీ, ఓపెన్ థియేటర్, పచ్చదనం తదితర సదుపాయాలను పరిశీలించి నివేదిక సమర్పించారన్నారు. దీంతో కళాశాలకు 'నాక్ బీ.ప్లస్‌ప్లస్' గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్పౌజ్‌ను పరిగనలోకి తీసుకోవాలి

సత్తెనపల్లి, ఆగస్టు 28: ఉద్యోగుల బదిలీ సందర్భంలో ఏ శాఖలోనైనా స్పౌజ్‌ను పరిగనలోకి తీసుకోవాలని ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభానీ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. భార్య, భర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే సాధ్యమైనంతవరకు వారు వీలైనంత దగ్గరలో విధులు నిర్వహించుకొనుటకు అవకాశం కల్పించేలా జీవోలు ఉన్నాయన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో ఈ విషయంలో వింత పద్ధతి కొనసాగుతోందన్నారు. ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటులో స్పౌజ్ క్యాటగిరి వర్తించాలంటే భార్య, భర్తలిద్దరూ విద్యాశాఖలో మాత్రమే పనిచేస్తూ ఉండాలని, వేరే శాఖలో పనిచేస్తూ ఉంటే స్పౌజ్ క్యాటగిరి వర్తించదని చెప్పటం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని విరమించుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని చేస్తామని ఆయన హెచ్చరించారు.

ల్యాబ్‌కు ఎరువుల నిల్వల నమూనాలు

నకరికల్లు, ఆగస్టు 28 : ఎరువుల నిల్వల నమూనాలను సేరించి నాణ్యతా ప్రమాణాల పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపినట్టు మండల వ్యవసాయ అధికారి కే.దేవదాసు తెలిపారు. బుధవారం చీమలమర్రి గ్రామంలోని శివాంజనేయ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ ఎరువులను ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మ కూడదని, అలా అమ్మితే ఆయా దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతు సంతకం, మొబైల్ నెంబరు ఉండే విధంగా డీలర్లు తగు చర్యలు తీసుకోవాలని దేవదాసు సూచించారు.

వృక్షాల నరికివేతను నివారిద్దాం

దుర్గి, ఆగస్టు 28: మండలంలోని అటవీ ప్రాంతాల్లో వృక్షాలను విచ్చలవిడిగా నరికివేస్తున్నారని, దీన్ని నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఎంపీపీ యేచూరి సునీతా సాయిశంకర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటగా అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద అన్నారు. ఎంపీపీ సునీతా సాయిశంకర్ మాట్లాడుతూ.. ధర్మవరంలో ఫిల్టర్ బెడ్‌లు సరిగాలేక తాగు నీరు మురుగా వస్తుందని, రూ. 40 లక్షల అంచనాలతో ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మంచినీటిని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఫణీంద్రకుమార్, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏవో అమీర్‌రెడ్డి, శివప్రసాద్, సీడీపీవో పద్మజ పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎమ్మెల్యే వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బెల్లంకొండ, ఆగస్టు 28 : పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమ వాల్ పోస్టర్లను బుధవారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, నేతలు పలువురు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలోని పాలన పరమైన సమస్యలు ఏమైనావుంటే 8985808279 నెంబరుకు ఫోన్ చేయాలని, ఆయా సమస్యలను ఎమ్మెల్యే ప్రవీణ్ తెలుసుకొని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత నాయకుడు పీఎస్‌కే రసూల్, ముల్లా బిక్షం, మాజీ సర్పంచ్ వెంకయ్య, శ్రీనివాసరావు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గంగారావు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్ చంద్రబోస్ బాధ్యతల స్వీకారం



మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరిని కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న కమిషనర్

వినుకొండ టౌన్, ఆగస్టు 28: వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్ చంద్రబోస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరిని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినుకొండ పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినికి ఆర్థికసాయం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న హెచ్ఎం విజయలక్ష్మి

శావల్యాపురం, ఆగస్టు 28: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ట్రిపుల్ ఐటీలో సీటును సాధించిన విద్యార్థినికి ఉపాధ్యాయులు ఆర్థికసాయాన్ని అందించారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన ఉప్పు బసవరాణి ట్రిపుల్ ఐటీ ప్రకటించిన మూడో జాబితా స్పోర్ట్స్ కోటాలో సీటు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులు రూ.15వేల ఆర్థికసాయాన్ని హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి చేతులమీదుగా బుధవారం అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ బసవరాణి చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినప్పటికీ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో 6వ తరగతి నుంచి పట్టుదలతో సాధనచేసి పదిసార్లు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొందన్నారు. జూనియర్స్ విభాగంలో బీహార్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొని సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్‌ఐటీ సీటుకోసం 500మంది దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 20మందికి ట్రిపుల్ ఐటీ సీట్లు ఖరారు చేసిందని, వారిలో బసవరాణి 6వ స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం బసవరాణిని, ఆమెకు ప్రేరణనిచ్చిన పీడీ రాధాకృష్ణమూర్తిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, నిర్మల, రికార్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



అయ్యన్నపాలెంలో చెంచులతో మాట్లాడుతున్న బీటీడబ్ల్యూవో లోతేటి వరలక్ష్మి

చెంచులకు మౌలిక వసతుల కల్పన: డీటీడబ్ల్యూవో

బొల్లాపల్లి, ఆగస్టు 28: మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలోని చెంచు కుటుంబాలను బుధవారం డీటీడబ్ల్యూవో లోతేటి వరలక్ష్మి సందర్శించటం జరిగింది. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా చెంచు కుటుంబాలను సందర్శించామన్నారు. వారికి కావాల్సిన మౌలిక సదుపాయల గురించి చర్చించారు. వారి స్థిర నివాసం, మౌలిక వసతులు, ఇళ్ళు మంజూరైన వారికి నిధులు మంజూరు చేయటం గురించి ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పీపాల సాయిబాబా, హౌసింగ్ ఏఈ వాగ్యా నాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ రూరల్ సీఐగా ప్రభాకర్ బాధ్యతల స్వీకారం



వినుకొండ, ఆగస్టు 28: వినుకొండ రూరల్ సీఐగా బి.ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభాకర్ తుళ్లూరు నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ప్రభాకర్ తమ్ముడు శివరామయ్య వినుకొండ పట్టణ ఎస్ఐగా పని చేశారు. నేడు అన్న రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

● బీజేపీ పల్నాడు జిల్లా జనరల్ సెక్రటరీ మేడం రమేష్

బొల్లాపల్లి, ఆగస్టు 28: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి ఆదేశాల మేరకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బొల్లాపల్లి మండలంలో ప్రారంభిస్తున్నట్లు పల్నాడు జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ మేడం రమేష్ బుధవారం తెలిపారు. వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని ఎంపీపీ కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్రవర్గ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నుంచి 15వేల వరకు సభ్యత్వాలు చేయాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. ఎక్కువగా గిరిజనులు నివసించే బొల్లాపల్లి మండలంలో గిరిజనులకు సభ్యత్వం ఎక్కువమందికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యదర్శి గొడవర్తి సుజాత, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, రవి నాయక్, రాజవరపు శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాగేశ్వరరావు, మండలంలోని బూత్ కన్వీనర్లు తదితరులు హాజరయ్యారు.

● వినుకొండ టౌన్, ఆగస్టు 28: స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మేడం రమేష్ ఆధ్వర్యంలో బుదవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మేడం రమేష్ మాట్లాడుతూ ప్రతి బూత్‌లో, ప్రతి వీధిలో భారతీయ జనతాపార్టీ విజయాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. సభ్యత్వం నమోదుకు 8800002024 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాఘవులు, గర్రె అనీల్, రాజ, సుధాగణేష్, నారిశెట్టి మహేష్, యాదాల అనీల్, గోడవర్తి సుజాత, లక్ష్మీ, దేసు వెంకట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ తనిఖీ

వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో



వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో రోగులతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్

వినుకొండ, ఆగస్టు 28: ఎన్టీఆర్ వైద్యసేవ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ బుదవారం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలను బుధవారం తనిఖీచేశారు. ప్రభుత్వం రోగులకు అందిస్తున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం రోగులకు అధికారులు అందిస్తున్న మందులు, భోజనం సప్లై తదితర అంశాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ సీజనల్‌గా వ్యాపించే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు ఉచితంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద చూస్తారని, రోగులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా అన్ని పరీక్షలు ఉచితంగా చూస్తారని తెలిపారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రజాక్, వైద్యమిత్ర మాచర్ల బుజ్జి, టీమ్‌లీడర్ ప్రశాంతి, రత్నం డీఈవో సాగర్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాబార్డు తోడ్పాటు

డీడీఎం శరత్‌బాబు



శావల్యాపురంలో జరిగిన క్యార్యక్రమంలో పాల్గొన్న నాబార్డు డీడీఎం శరత్‌బాబు

శావల్యాపురం, ఆగస్టు 28: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా నాబార్డు సంస్థ ప్రజలకు తమవంతు సహకారాన్ని అందిస్తూ వారిని ఎంతో ప్రోత్సహిస్తోందని నాబార్డు డీడీఎం గుడ్లాల శరత్‌బాబు అన్నారు. నాబార్డు సహకారంతో నేచురల్ హెల్త్‌కేర్ సొసైటీవారి ఆధ్వర్యంలో శావల్యాపురంలో జరుగుతున్న ఎల్ఈడీ బల్బుల శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. డీడీఎం శరత్‌బాబు మాట్లాడుతూ నాబార్డు ద్వారా పల్నాడు జిల్లాలో పలుచోట్ల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నాబార్డు ట్రైబల్‌ఫండ్‌తో పల్నాడు జిల్లాలో నాలుగు చోట్ల 2000మంది గిరిజనులకు హార్టికల్చర్ సాగుపై శిక్షణ ఇచ్చి ఒక్కొక్కరికి ఎకరం పొలంలో పంటలు పండించేందుకు ఆర్థికసాయాన్ని అందిస్తున్నామన్నారు. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో పల్నాడు జిల్లాలో 32వాటర్ షెడ్లను అభివృద్ధి చేసి 25వేల హెక్టార్లకు నీటిని అందించేలా కృషి చేస్తున్నామన్నారు. ఎంఈడీపీ, ఎల్ఈడీపీ, స్కిల్ డౌలప్‌మెంట్‌ల ద్వారా డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తయ్యాక యూనిట్‌ల ఏర్పాటుకు మహిళలకు బ్యాంక్‌రుణాలు మంజూరు చేయించి మార్కెటింగ్‌లో వారికి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం శావల్యాపురంలో ఎల్ఈడీ బల్బుల తయారీ, దాచేపల్లి మండలంలో విస్తరాలకు తయారీపై శిక్షణ ఇస్తున్నామన్నారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో రూ.15లక్షలతో రూరల్ హార్ట్ నిర్మాణం చేపట్టామని, రైతులు పండించిన కూరగాయలను రూరల్ హార్ట్‌లో నిల్వచేసుకొని మార్కెటింగ్ చేసుకొనే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. నాబార్డు సహకారాన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని కోరారు. కార్యక్రమంలో సీజీజీబీ మేనేజర్ వలేటి శివరామకృష్ణ, నేచురల్ కేర్ సొసైటీ సీఈవో భగవాన్‌దాస్, ట్రైనర్ లాజరు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలి

వినుకొండ ఏడీఏ రవిబాబు



శావల్యాపురం సొసైటీలో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవిబాబు

శావల్యాపురం, ఆగస్టు 28: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతుసేవాకేంద్రాలు, సొసైటీలు, గ్రోమోర్, ఫర్టిలైజర్ షాపుల్లో రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు. శావల్యాపురంలోని సొసైటీ కార్యాలయంలో ఎరువుల నిల్వలను ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, ఎరువుల ధరలు, బిల్లులు, రికార్డులను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు కొన్న రైతులందరికీ తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, బిల్లులపై రైతుల ఫోన్‌నెంబర్ వేయాలన్నారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠినచర్యలు తీసుకొంటామని, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మండలంలో యూరియా 266 టన్నులు, డీఏపీ 112 టన్నులు, పొటాష్ 46 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 243టన్నులు, సూపర్ ఫాస్పేట్ 58టన్నులు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. నానో యూరియా, నానో డీఏపీలు కూడా అందుబాటులో ఉన్నాయని, పొలాల్లో పంటలకు వేసిన ఎరువులు వృథా కాకుండా పంటలపై స్ప్రే చేసుకునేందుకు నానో ఎరువులు ఉపయోగపడతాయన్నారు. వారం రోజుల్లో మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాలకు ఎరువులు రానున్నాయన్నారు. రైతులు సాగుచేసిన పంటలను తప్పకుండా ఈ-పంటలో నమోదు చేసుకొని ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలు పొందాలన్నారు. ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు, సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్, వీఏఏ శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో హోల్‌సేల్, రిటేల్ ఎరువుల వర్తక వ్యాపారులతో ఏడీఏ రవిబాబు బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో రవిబాబు మాట్లాడుతూ ఎంఆర్‌పీ రేట్ల కంటే అధికంగా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గురువారం స్టాక్ రిజిస్టర్లు కార్యాలయంలో అందించాలని, గ్రామాల్లో ఎవరైనా అనధికారికంగా ఎరువులు విక్రయిస్తే 8331056959 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి

రొంపిచర్ల, ఆగస్టు 28: మండలంలోని చిట్టిపోతులవారిపాలెం గ్రామంలో వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు.

దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



సంగీతరావు (ఫైల్‌ఫొటో)

ఈపూరు, ఆగస్టు 28: దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండలంలోని అగ్నిగుండాలలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మాచర్ల సంగీతరావు (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వరినాట్లు వేసుకునే పొలంలో దమ్ముచేసేందుకు ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తూ ప్రమాదవశాత్తూ దమ్ము ట్రాక్టర్ బోల్తాకొట్టింది. డ్రైవర్ సంగీతరావు ట్రాక్టర్ కిందపడి మృతిచెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సెంట్రల్ యూనివర్సిటీకి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవినాయక్

సెంట్రల్ యూనివర్శిటీకి మోడల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

రొంపిచర్ల, ఆగస్టు 28: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇటీవల జరిగిన సెంట్రల్ యూనివర్శిటీ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రవినాయక్ బుధవారం తెలిపారు. హైదరాబాద్ యూనివర్శిటీలో రమావత్ జై శివనాయక్, కర్నాటకలోని సెంట్రల్ యూనివర్శిటీలో దాదా అభిషేక్, అనంతపూర్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రాజేష్ సీట్లు సాధించారని తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ రవినాయక్, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

సంగం రైతులకు బోనస్ పంపిణీ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28: మండలంలో పెట్లూరివారిపాలెంలోని సంగం డైరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనంలో పాడి రైతులకు బుధవారం బోనస్ పంపిణీ చేశారు. 85మంది పాడి రైతులకు రూ.2.20లక్షలు బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం డైరీ మేనేజర్ వీరేంద్రకుమార్, ప్లాంట్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, సహకార సంఘం అధ్యక్షుడు ఎ.రాంబాబు, జి.వెంకటేశ్వర్లు, పాలఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో పేట విద్యార్థికి ప్రథమ స్థానం

చిలకలూరిపేట, ఆగస్టు 28: గాజువాకలో కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో స్థానిక మోడరన్ స్టెల్లార్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి ధనుకోటి జశ్వంత్ కటా, టీమ్ కటా విభాగాలలో ప్రథమ స్థానాన్ని సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం జస్వంత్‌ను పాఠశాల చైర్మన్ చేబ్రోలు మహేష్, ప్రిన్సిపాల్ డి.ఫణికుమార్, కరాటే ఉపాధ్యాయిలు బి.రాజ అభినందించారు.

జాతీయ నంది అవార్డుకు బొడ్డుచర్ల ప్రసాద్ ఎంపిక

వినుకొండ టౌన్, ఆగస్టు 28: జాతీయ నంది అవార్డుకు ఎంపికైనట్లు చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాద్ బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఇటీవల విజయవాడలో కాళోజి తెలుగు వెలుగు బుక్‌ఆఫ్ రికార్డు, తెలుగు సాహిత్య వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో తానుగీసిన చిత్రాలకు అవార్డుకు ఎంపికయ్యానన్నారు. అవార్డును సెప్టెంబరు 15వ తేదీన విజయవాడలో అందుకోనున్నట్లు ప్రసాద్ తెలిపారు.

1న ఆదివాసీ పోరాటాలపై సంఘీభావ సదస్సు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28: ఆదివాసీ పోరాటాలకు సంఘీభావంగా నెల్లూరు పట్టణంలో సెప్టెంబరు 1న సదస్సు జరుగుతుందని పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ అన్నారు. బుధవారం నరసరావుపేట పట్టణ శివారు అష్ఫాకుల్లాఖాన్ కాలనీలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీ రామకృష్ణ మాట్లాడుతూ నెల్లూరు పట్టణంలోని టౌన్ హాల్‌లో ఉదయం 10గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందని, సాయంత్ర నాలుగు గంటలకు ర్యాలీ జరుగుతుందన్నారు. సదస్సుకు పర్యావరణ కార్యకర్త టీ రమణయ్య, న్యాయవాది సిద్ధార్థదొర తదితరులు హాజరవుతారన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శిఖినం చిన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బొల్లాపల్లి, ఆగస్టు 28 : మండలంలోని మూగ చింతలపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా బుధవారం బీజామృతం తయారీని చూపించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎన్ఎఫ్ఏ సైదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజామృతంతో విత్తనశుద్ధి, నారుశుద్ధి చేయటం ద్వారా విత్తనం, భూమి నుంచి వచ్చే తెగుళ్లను పూర్తిగా అరికట్టవచ్చన్నారు. బీజామృతం తయారీకి ఐదు కేజీల పేడ, ఐదు లీటర్ల దేశీ ఆవుమూత్రం, చిటికెడు సున్నం, వంద లీటర్ల నీరు అవసరమవుతాయన్నారు. వీటి తయారీలో రైతులకు ఎటువంటి ఖర్చు ఉండదని, రసాయనిక వ్యవసాయంలో నారుశుద్ధి కోసం రైతులు నాలుగు వందల నుంచి ఐదు వందలు ఖర్చు పెట్టాల్సి ఉందన్నారు. గ్రామాల్లోని రైతులందరూ ప్రకృతి వ్యవసాయం ఆచరించటం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గటంతో పాటు వారి నికర ఆదాయం పెరుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని, భూమి సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ వేణుగోపాల్, నాసర్ బాబు, సూరె, పల్లె దానయ్య, సుదర్శనం, పుల్లారావు, స్వయం సహాయక సంఘం మహిళలు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశాలు

● సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధుల గైర్హాజరు

శావల్యాపురం, ఆగస్టు 28: గ్రామాలలో నెలకొన్న ప్రజాసమస్యలను అధికారుల దృష్టికితెచ్చి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశాలకు డుమ్మా కొడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలోని 15మంది సర్పంచ్‌లకు ఆరుగురు, 11మంది ఎంపీటీసీలకు ఐదుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మొత్తం 20శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాల్సి ఉండగా 12మంది మాత్రమే హాజరవ్వడంతో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అసంతృప్తిని వ్యక్తం చేశారు. వచ్చే సమావేశానికి గైహాజరైన అధికారులకు మెమోలు జారీ చేస్తామన్నారు. ఈవోపీఆర్డీ సుగుణ మాట్లాడుతూ పంచాయతీలకు త్వరలో 15వ ఆర్థికసంఘం నిధులు విడుదల కానున్నాయని, సర్పంచ్‌లు, కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పలు గ్రామాల్లో వీధిలైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 2014-2019 మధ్యలో బిల్లులు జమకాని గృహాలు, మరుగుదొడ్లను సెప్టెంబరు 1నుంచి అధికారులు తనిఖీచేసి 5వ తేదీలోపు బిల్లులు చెల్లిస్తారని ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ రసూల్ తెలిపారు. గృహనిర్మాణాలకు ఇప్పటి నుంచి ప్రభుత్వం రూ.4లక్షలు అందజేయనుందన్నారు. వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి పాల్గొన్నారు.

పెరుగుతున్న జ్వర పీడితులు



రొంపిచర్లలో చికిత్స పొందుతున్న జ్వర బాధితురాలు

రొంపిచర్ల, ఆగస్టు 28: మండలంలోని గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు అధికంగా ఉన్నాయి. రొంపిచర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆయా ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రజలు జ్వరాలు అధికంగా ఉన్నా అధికారులు, సిబ్బంది శిబిరాలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఆషా వర్కర్లు, ఏఎన్ఎంలు చేస్తున్న సర్వేలకు ఫలితం లేకుండాపోయింది. జ్వర బాధితులు స్థానిక ఆర్ఎంపీల వద్ద వైద్యసాయం పొందుతున్నారు. మరికొంతమంది నరసరావుపేట వెళ్ళి చికిత్సలు చేయించుకుంటున్నారు. ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెపుతున్నా అవి ప్రకటనలకే పరిమితమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు చర్యలు తీసుకొని జ్వరాలు అధికంగా ఉన్న చోట శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు

డ్రగ్స్ రహిత విద్యాలయాలను నిర్మిద్దామంటూ ర్యాలీ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28: స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్ రహిత విద్యాలయాలను నిర్మిద్దాం అనే లక్ష్యంతో డ్రగ్స్ ఫ్రీ ఇనిస్టిట్యూషన్స్ కార్యక్రమం జరిగింది. డ్రగ్స్ రహిత విద్యాలయాలను నిర్మిద్దామని కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ టీవీ శంకరరెడ్డి, డాక్టర్ ఏ సరళాదేవి, ఆర్.వేణుమాధవ్, పీ శ్రీనివాసులు, డాక్టర్ పీఎస్‌వీడీ మహేష్, ఎం అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

నాదెండ్ల, ఆగస్టు 28: మండలంలోని తూబాడు గ్రామ పరిధిలోని గుణ్ణంవారిపాలెంలో బుధవారం పోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. వైభవంగా నిర్వహించిన ఈ ప్రతిష్ఠా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. కాగా జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో-కన్వీనర్ పెంటాల బాలాజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు యువ నాయకులు బండికట్ల రాజగోపాల్, షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



యార్లగడ్డ శ్రీలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఇతర ప్రముఖులు

యార్లగడ్డ శ్రీలక్ష్మికి ఘన నివాళి

వినుకొండ, ఆగస్టు 28: వినుకొండ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిల్ కుమార్ సతీమణి యార్లగడ్డ శ్రీలక్ష్మి సంతాపసభను నరసరావుపేట రోడ్డులోని జయకృష్ణ టవర్స్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు, బీజేపీ జిల్లా అధ్యక్షుడె ఆలోకం సుధాకర్‌బాబు, డాక్టర్ నన్నపనేని సుధా, డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, జడ్ఆర్‌యూసీసీ రైల్వే బోర్డు మెంబర్ గోరంట్ల సత్యనారాయణతోపాటు పల్నాడు జిల్లా బీజేపీ ఇన్‌చార్జులు, శివశక్తి లీలాఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణ, తెలుగు దేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు పలువురు శ్రీలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ఏఎంజీ పాఠశాలలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ

చిలకలూరిపేట, ఆగస్టు28: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక ఏఎంజీ పాఠశాలలోని విద్యార్థులు ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, ఫిట్ ఇండియా స్కూల్ అక్షరాల ఆకృతిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ పాల్గొన్నారు.